
# మామగారు

ఎం. వీరేశ్వరరావు



**ఆ రోజు వారపత్రిక చూస్తూ కూర్చున్న నాకు పత్రికలో కార్టూన్ చూసి ఒక సందేహం వచ్చింది. ఆ కార్టూన్ ఏమిటంటే మామగారు గోచీ పెట్టుకుని వెడుతున్నాడు - కారణం ముందురోజు అల్లుడు వచ్చి వెళ్లడమే!**

ఎప్పుడూ మామల్ని ఏడిపించే అల్లుళ్లని చిత్రించే కథలు, కార్టూన్‌లు వచ్చాయి కానీ, అల్లుళ్లని ఏడిపించే మామల గురించి కథలు ఎందుకు రాలేదో? అలాంటి కథ ఒకటి చూద్దాం.

* * *

రాంబాబు హాయిగా, ప్రశాంతంగా కూర్చుని చెత్తరాజకీయాలు నిండిన పత్రిక చూస్తున్నాడు. అప్పుడే రాంబాబు శ్రీమతి సరళ పక్కకి వచ్చి, "ఏమండీ! మా నాన్న ఊరునుండి వస్తున్నాడండీ!' ' అని బాంబు పేల్చింది.

''మొన్ననే వచ్చారు కదా!'' అన్నాడు రాంబాబు.

"నాన్నకి ఊర్లో ఏం తోచడంలేదట. నేను ఒక్కర్తినే కదా! మొన్న కలలోకి వచ్చానట. చూడాలని వస్తున్నాడు!" అని చెప్పింది సరళ.

"ఎప్పుడు మీ నాన్నగారి రాక?" చిరాకుగా రాంబాబు.

"రేపుఉదయం అలారంపెట్టుకుని ఆరు గంటలకి వెళ్లండి. ప్రైవేట్‌బస్సు త్వరగా వస్తుంది."

"అలాగే!" అన్నాడు రాంబాబు.

మధుసూదనరావుకి సరళ ఒక్కర్తే కూతురు. మంచి అల్లుణ్ని కొట్టేయడానికి మధుసూదనరావు తన కోర్టు గొడవల్లో ఉన్న ఇంటిని అల్లుడు (కాబోయే) రాంబాబుకి ఇస్తానని ఆశ చూపడంతో రాంబాబు రెండో ఆలోచన లేకుండా పెళ్లి చేసుకున్నాడు - సరళ సరళరేఖలా ఉన్నా. పెళ్లయింది కానీ ఇల్లు ఇంకా కోర్టుగొడవల్లోనే ఉంది. గొడవ ఎప్పుడు తెములుతుంది, అది అమ్మి ఎప్పుడు డబ్బు ఇస్తారు మామగారూ! అంటే - లాయర్ 'లయ్యర్' అయ్యాడని మధుసూదనరావు జవాబు చెప్తున్నాడు.

* * *

రాంబాబు మామగారు మధుసూదనరావు హైదరాబాదులో ఉన్నా, అమలాపురంలో ఉన్నా తన పద్ధతులు నడవాలంటాడు. ఏమైనా లోటు వస్తే సరళ దగ్గర "అదేమిటమ్మా! తల్లి లేకపోయినా నిన్ను తల్లీ తండ్రీ అయిపెంచాను. ముసిలాడిమీద ప్రేమ లేదు!" అంటూ సెంటిమెంటల్ సీను పండిస్తాడు. అంతే! హైదరాబాదులో ఉన్నా కోఠీ, అబిడ్స్, నల్లకుంట - ఎక్కడికైనా వెతికి నశ్యం తీసుకురావల్సిందే. దానికోసం ఆఫీసులో పర్మిషన్లు పెట్టి, రెండు చీవాట్లు తిని తేవాల్సిందే!

* * *

మధుసూదన్ రాంబాబు ఇంటికి వచ్చాడు.

వచ్చాక నాలుగురోజులకి రాంబాబు అడిగాడు - "ఏమండీ ఆ ఇల్లు ఇస్తే అందరం ఒకచోట హైదరాబాదులో మంచి ఫ్లాటులో ఉండవచ్చు!" అన్నాడు రాంబాబు ఆఫీసుకి బయలు దేరుతూ.

"లాయర్ తెమల్చడంలేదు!" అంటూ నాన్చి, "అబ్బాయి! వచ్చేటప్పుడు దిల్‌సుఖ్ నగరల్‌లో ఉన్న మంచి హోమియో స్టోర్సులో 'నక్స్‌వామికా' తీసుకురా! మర్చిపోయాను - 'పొటెన్సీ 200'!" అన్నాడు రాంబాబు మామగారు.

"దిల్‌సుఖ్‌నగరా? సికింద్రాబాదు నుండి..." కోపంగా మొహం పెట్టి , 'రెండూ పక్కపక్కన ఉన్నాయా?" అడిగాడు రాంబాబు.

"సిటీబస్సులో వెళ్లు. ఆటో ఎక్కకు! ఖర్చులు ఎక్కువ పెట్టకు, నాలుగురాళ్లు వెనక్కి వేసుకో!" ఉచితం కదా అని నాలుగు సలహాలు ఇచ్చాడు.

"నాలుగురాళ్లేం ఖర్మ, నలభై వేసుకోవచ్చు. హైదరాబాదులో ఎక్కడ చూసినా అవే కదా!" అని బస్‌స్టాప్‌కి వచ్చాడు.

ఒకడి కాలు తొక్కి, మెట్రో కాని బస్సు ఎక్కి, నక్స్‌వామికా, అనామికా అనుకున్నాడు. ప్రాస కోసం ప్రయాస కదా అనుకున్నాడు.

వెర్రిముఖాలు వేసుకున్న ప్రయాణికుల్ని పట్టించుకోకుండా బస్‌స్టాప్‌లో ఆగకుండా పోయింది.

* * *

రాత్రి.

మధుసూదన్ వీరలెవల్లో గురకపెడుతున్నాడు. మధుసూదన్ గురక ఎలాంటిదంటే ఉదయం నాలుగుబ్లాక్‌ల తర్వాత అపార్ట్‌మెంట్‌లో ఉన్న అతను కూడా గుర్తుపట్టి అడుగుతాడు - "మీ మామగారు ఊరినుండి ఎప్పుడు వచ్చాడు?" అని.

పన్నెండు తర్వాత మధుసూదన్ లేచాడు. లేచి, 'అమ్మాయ్! మంచినీళ్లుపెట్టడం మరిచిపోయావు!' అంటూ రాంబాబు గది తలుపు కొట్టాడు.

"మీ నాన్న పిలుస్తున్నాడు, వెళ్లు!" రాంబాబు చిరాకుగా మొహం పెట్టాడు - అప్పుడే వచ్చిన 'మూడ్'ని ముసలాడు చెడగొట్టాడని.

చిన్న చిన్న ఇబ్బందులు భరిస్తున్నాడు రాంబాబు - ఎప్పటికైనా ముసలాడు ఇల్లు అమ్మి పైసల్ ఇస్తాడని.

* * *

మరునాడు ఉదయం.

"మామగారు ఊరు వెళ్లి ఆ ఇల్లుసంగతీ..." అంటూ ప్రారంభించాడు రాంబాబు.

"వచ్చేటప్పుడు తెచ్చామా? వెళ్లేటప్పుడు తీసుకుపోతామా? ధనం శాశ్వతమా? అంతా మిథ్య!" అన్నాడు నవ్వుతూ మధుసూదన్.

'ఓరి నీ లౌక్యం పాడుగానూ! అసలు విషయం నుండి పక్కకి మళ్లిస్తున్నావే?' అనుకున్నాడు రాంబాబు.

* * *

మరునాడు ఆఫీసు నుండి రాంబాబు ఇంటికి రాగానే మామ మధుసూదన్‌రావు కనబడలేదు.

"మీ నాన్నగారు ఎక్కడ?"

"మా పెదనాన్న వచ్చి తీసుకెళ్లాడు. రేపు మీరు వెళ్లి నాన్నగారిని జాగ్రత్తగా మెట్రోలైనర్‌లో తీసుకురండి!" అంది సరళ.

"అలాగే, అమ్మడూ! మామగారు ప్రస్తుతం ఎక్కడ?"

"హయత్‌నగర్‌లో ఉన్నారు. అడ్రస్ ఇదిగో!" సరళ జవాబు ఇచ్చింది.

"హయత్‌నగర్ నుండి కూకట్‌పల్లి రావాలి. పైగా మెట్రోలైనర్‌లో! డబ్బులు చెట్టుకి కాస్తున్నాయి కదా!" అన్నాడు రాంబాబు వెటకారంగా.

మామగారు ముప్పయిరూపాయల ఖర్చుతో హయత్‌నగర్ నుండి కూకట్‌పల్లి వచ్చాడు.

"ప్రయాణం హాయిగా జరిగిందమ్మా! కొత్త బస్సులు కదా! గాలిలో తేలిపోతున్నట్టుంది" అన్నాడు మధుసూదన్ - సరళ ఇచ్చిన కాఫీ తాగుతూ.

"మీకు గాలిలో తేలుతున్నట్టు, నాకు రూపాయలు గాలిలో ఎగురుతున్నట్టు ఉంది!" అన్నాడు రాంబాబు కసిగా.

"అల్లుడుగారు జోక్ చేశారు!" అంటూ మధుసూదనరావు నవ్వుతూ హోమియో మందు డబ్బా తీశాడు.

* * *

సెలవులు ఎక్కువ పెడుతున్న కారణంగా రాంబాబుని మేనేజర్ నాలుగుచీవాట్లు వేశాడు పని పెండింగ్‌లో ఉండిపోయింది. దాంతో తిక్కరేగిన రాంబాబు మామగారికి రిజర్వేషన్ చేయించి బస్సు ఎక్కించి పంపేశాడు. వెడుతూ మధుసూదనరావు లాయర్ ఫీజుకి డబ్బులు సరిపోలేదని ఒక వెయ్యి రూపాయలు రాంబాబు దగ్గర తీసుకునిపోయాడు.

* * *

మధుసూదనరావు అమలాపురం వెళ్లాక ఉత్తరం రాలేదు. పదిరోజుల తర్వాత ఒక బాంబు లాంటి వార్త చేరింది రాంబాబుకి. రాంబాబు, సరళ అమలాపురం వెళ్లారు. ఉదయం మామగారి ఇల్లు చేరగానే చాలామంది చేరి ఉన్నారక్కడ.

"జాతస్య మరణం ధృవం!" అంటున్నాడు ఒకాయన.

"అల్లుడిని ఎలా ఇబ్బందిపెట్టినా కథలా చెబుతూ, నవ్వుతూ ... నవ్వుతూ ఉండగానే పోయిందమ్మా ప్రాణం! అదృష్టవంతుడు!" కన్నీటితో జవాబిచ్చాడు మధుసూదనరావు ప్రాణస్నేహితుడు భాస్కరరావు.

"నాన్నా!" అని ఘొల్లుమంది సరళ.

రాంబాబు లోపలికి వెళ్లి మామగారిని చూశాడు. నవ్వుతున్నట్టు మొహం అలాగే ఉంది. 'వచ్చావా!' అని పలకరించినట్టయింది.

అనవసరంగా పంపించానా? కొన్నాళ్లు అక్కడే ఉంటే? అని అపరాధభావన రాంబాబు మనస్సులో మెదిలింది.

భాస్కరరావు వచ్చి రాంబాబుకి కవరు ఇచ్చాడు - మామగారి సంచిలో దొరికిందని.

కవరులో రెండులక్షల చెక్కు ఉంది రాంబాబు పేరుతో.

విషయం అర్థం అయి కంట్లో నీళ్లు తిరిగాయి రాంబాబుకి.

"అల్లుడుగారికి ...

"పండగకి నీకు ఇద్దామని ... వెంటనే విషయం వ్రాయలేదు."

.......

మధుసూదనరావు పోస్ట్ చెయ్యని ఉత్తరం రాంబాబు కన్నీళ్లతో తడిసి పోతోంది.

Ⓟ

